## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సప్ ద్వారా పంపగలరు



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పామన్యుడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా నూతనంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాలో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు  మండల

నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 76 ఎడిటర్ :పెనుగొండ సతీష్ శనివారం 25 అక్టోబర్ 2025 పేజీలు 8 వెల 5.00




### గురుపురబ్ ఉత్సవానికి
## సిఎం రేవంత్‌కు ఆహ్వానం

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన పంజాబ్ మంత్రులు సంజీవ్ అరోరా, గుర్మీత్ సింగ్ ఖుడియన్ లు కలిశారు. పంజాబ్‌లో జరిగే 350వ 'గురుపురబ్' ఉత్సవానికి పంజాబ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రుల ప్రతినిధి బృందం ఆహ్వానం అందచేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మంత్రుల బృందానికి సిఎం స్వాగతించి శాలువా కప్పి సన్మానించారు.

## పార్క్ స్థలానికి వీడిన చెర
### - కబ్జా నుంచి కాపాడిన హైడ్రా



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : అక్రమ నిర్మాణాల కూల్చివేతలే ధ్యేయంగా హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయి. పార్కును కబ్జా చేసి.. బై నంబర్లు సృష్టించి సొంతం చేసుకునే ప్రయత్నాలకు హైడ్రా అడ్డుకట్ట వేసింది. కొండాపూర్‌లాంటి ఖరీదైన ప్రాంతంలో ఏకంగా 2000 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా శుక్రవారం కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని రాఘవేంద్ర కాలనీలో పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2 వేల గజాలను లే ఔట్‌లో చూపించారు. పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు ఆ స్థలాన్ని కబ్జా చేయడంపై దృష్టి పెట్టారు. బై నంబర్లు సృష్టించి 10 ప్లాట్లు చేసేశారు. ప్రతి ప్లాట్‌లో ఒక షెడ్డు వేశారు. దీనిపై రాఘవేంద్ర కాలనీ సి బ్లాక్ వెల్ఫేర్ అండ్ కల్చరల్

2 లో

# కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం



- మంటల్లో కాలి బూడిదయిన బస్సు
- ప్రమాదంలో 19 నిండు ప్రాణాలు బుగ్గి
- బైకును ఢీకొని తగులబడ్డ బస్సు
- ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
- బతికిబయటపడ్డ 22మంది

(ఆకాంక్ష న్యూస్)

కర్నూలు, అక్టోబర్ 24 : యాటకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగులబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది. శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2-3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి



బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను

2 లో

### అంగన్‌వాడీ కేంద్రాలకు
## సక్రమంగా సరుకులు
### - సంక్షేమశాఖ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : అంగన్వాడీ కేంద్రాలకు సరకుల సరఫరా నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క శుక్ర వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనే, బాలామృతం, మురుకులు, బియ్యం సరఫరాపై జిల్లాల వారిగా మంత్రి సీతక్క సమీక్ష చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల ప్రగతిని మంత్రి సీతక్క సమీక్షించారు. పలు జిల్లాల్లో సరకుల సరఫరా ఆశించిన మేర లేకపోవడంపై కాంట్రాక్టర్లపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మాదిరిగా సరకుల సప్లైయర్స్ వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సరకుల సరఫరాలో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆజ్ఞాపించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకారం అందించడంలో రాజీ పడేది లేదని

2 లో




## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

- నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ధి చెప్పాలి
- బాకీ కార్డు విడుదల సందర్భంగా హరీష్ విమర్శలు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడు తారని అంటే ఘాటుగా హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ,

2 లో

### ప్రజల ప్రాణాలతో
## ట్రావెల్స్ బస్సుల చెలగాటం

- కర్నూలు ఘటనపై బిజెపి అధ్యక్షుడు రామచంద్రారావు దిగ్భ్రాంతి
- కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురైన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య చికిత్సను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా ప్రభుత్వం సమగ్ర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రామచందర్ రావు

2 లో

## స్లీపర్ బస్సుల్లో ప్రమాదాలు ఎక్కువే



- ఇటీవలే రాజస్థాన్‌లో ఇలాంటి ఘోరమే
- స్లీపింగ్ సిస్టమ్‌తో ప్రమాదం నుంచి బయటపడలేని వైనం

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న బస్సు దుర్ఘటన అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 10 రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇదేతరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇవే కాదు.. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. వీటి నిర్వహణకు

2 లో

## వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమాలు

- డయ్యూ డమన్లో రిజిస్ట్రేష్... ఆల్టరేషన్
- సీటింగ్ బస్సును స్లీపర్ బస్సుగా మార్పు
- తెలుగు రాష్ట్రాల్లో తిప్పుతూ దందా

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,అక్టోబర్ 24 : కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో 19 మందిని విగత జీవులుగా చేసిన వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమ బాగోతం తేటతెల్లం అయ్యింది. ఆ సంస్థ నిర్వహించిన ఈ బస్సు సీటింగ్ క్యారియరే కానీ స్లీపర్ సర్వీస్ కాదని తేలింది. వేమూరి కావేరి ట్రావెల్స్ పేరిట హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖపట్నం రూట్‌లలో టూరిస్టు పర్మిషన్లతో పర్యాటక ప్రాంతాలకు బస్సులను తిప్పే

2 లో

# కావేరి బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు

## పెండింగ్‌లో రూ.23,120 ఫైన్లు - అనేక ఉల్లంఘన కేసులు ఉన్నట్లు గుర్తింపు

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన బస్సు 9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. 'కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం అని రవాణా శాఖ పేర్కొంది. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. అయితే ఇప్పటి వరకు వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాన్యం ఇంక స్పందించిక పోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

## మంటలు గుర్తించి కిందకు దూకా

### - ప్రాణాలతో బయటపడ్డ ఆకాశ్

(ఆకాంక్ష న్యూస్)

కర్నూలు, అక్టోబర్ 24 : కర్నూలు జిల్లాలో వేమూరి కావేరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదానికి గురి కావడంతో పలువురు సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాద సమయంలో కొందరు ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రాణాలతో బయటపడిన ప్రయాణికుడు ఆకాశ్.. ప్రమాదం జరిగిన తీరును వివరించారు. తాను దీపావళికి హైదరాబాద్ వచ్చి తిరిగి బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కినట్లు చెప్పారు. బస్సులో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. హఠాత్తుగా లేచి చూడగా పెద్దఎత్తున మంటలు వచ్చాయి. వెంటనే బస్సు అద్దం పగలగొట్టి బయటకు దూకేశాను. నాతో పాటు బస్సులో నుంచి మరో ఇద్దరు బయటకు దూకారని ఆకాశ్ వివరించారు.

## బస్సు ప్రమాదంలో ఆచూకీలేని తల్లీకొడుకు

(ఆకాంక్ష న్యూస్)

పటాన్‌చెరు, అక్టోబర్ 24 : కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి బయలుదేరిన వారు ఇద్దరు ఉన్నారు. బెంగళూరుకు చెందిన తల్లీ కుమారులు పిలోమి నాన్ బేబీ (64), కిషోర్ కుమార్(41) ఇటీవల దీపావళి పండగకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని కృషి డిఫెన్స్ కాలనీలోని బంధువు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాము ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు అంబేడ్కర్ కూడలి వద్ద వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి బెంగళూరు బయలుదేరారు. అయితే ఈ లోపే చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదానికి గురవడంతో వీరు క్షేమంగా ఉన్నారా లేదా? అనేది తెలియడం లేదు. వారి ఆచూకీ కనుక్కునేందుకు రాము దంపతులు కర్నూలుకు బయలుదేరి వెళ్లారు.

## వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమాలు

మొదటి పేజీ తరువాయి

సంస్థగా నమోదైంది. తెలంగాణకు చెందిన హెబ్రాన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత వేమూరి వినోద్ కమార్ ఈ బస్సును కొనుగోలు చేసి తీసుకుని కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడే వేమూరి కావేరి సంస్థ అక్రమానికి తెరలేపింది. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో డయ్యూ డామన్‌లో చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. డయ్యూ డామన్‌లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్ .. ఒడిశాలోని రాయగడలో ఆల్టేషన్, ఫిట్‌నెస్ చేయించుకున్నారు. రాయగడ అధికారులు ఆల్టేషన్, ఫిట్‌నెస్ మంజూరు చేసేటప్పుడు బస్సు సామర్థ్యం, సీటింగ్ వివరాలను స్పష్టంగా పొందుపరిచారు. కేవలం ప్రమాదానికి గురైన బస్సుకు 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ మాత్రమే ఇచ్చారు. కానీ కావేరి ట్రావెల్స్ సంస్థ స్లీపర్ క్యారీయర్‌గా మార్చింది. ఇలా మార్చడం బస్సు సామర్థ్యాన్ని అధిగమించడమే. డయ్యూ డామన్‌లో సీటింగ్ సామర్థ్యం ఉన్న బస్సు రవాణా పన్ను ఒక్క సీటుకు రూ.450 మాత్రమే అదే స్లీపర్ సీటు అయితే రూ.800 అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఛార్జీలు చాలా ఎక్కువ. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటుకు రూ.4500 పన్ను చెల్లించాలి. అదే స్లీపర్ సీటుకు అయితే రూ.12వేల చొప్పును ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించాలి. ఇలా ట్యాక్స్‌లను ఎగవేసేందుకే వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ అక్రమ రిజిస్ట్రేషన్, ఆల్టేషన్ చేయించింది.

## కర్నూలు బస్సు ప్రమాదంలో ఇద్దరు టెక్కీల మృతి

### - ఒకరు ఎపివాసి కాగా..మరొకరు తెలంగాణ వాసి
### - ఇద్దరు అమ్మాయిలూ బెంగుళూరులో పని

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతిచెందారు. ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి (27), తెలంగాణలోని యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తకొండూరుకు చెందిన అనూషరెడ్డి చనిపోయారు. వీరిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. ధాత్రి ఇటీవల హైదరాబాద్‌లోని పెదనాన్న ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు గురువారం రాత్రి వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న ధాత్రి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లి వాణి, బంధువులు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. ధాత్రి మృతికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. యాదాద్రి జిల్లాకు చెందిన అనూషరెడ్డి దీపావళికి స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి బెంగళూరుకు బయల్దేరారు. ఖైరతాబాద్‌లో బస్సు ఎక్కి ఈ దుర్ఘటనలో మృతిచెందారు. అనూష మృతితో ఆమె తల్లిదండ్రులు కన్నీమున్నీరవుతున్నారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన మరికొందరిని గుర్తించాల్సి ఉంది.

## స్లీపర్ బస్సుల్లో ప్రమాదాలు ఎక్కువే

మొదటి పేజీ తరువాయి

కఠిన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 30 నుంచి 36 బెర్తులు ఉంటాయి. అదే మల్టీ యాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరు అడుగుల పొడవు.. 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీతోనే ఇక్కడ సమస్య. ఈ గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండటంతో ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకైన ప్రాంతం నుంచి వేగంగా బయటకు రాలేకపోతున్నారు. స్లీపర్ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగానే ఉంటున్నా.. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికుల కదలికలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఇక, స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్యగా మారుతోంది. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఉన్నట్టుండి ఒక వైపునకు ఒరిగిపోయినప్పుడు.. ప్రయాణికులు కిటికీలను లేదా ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టంగా మారుతోంది. ఈ ఎత్తు వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు కూడా ఆటంకం కలుగుతోంది. బస్సు ఎక్కి ప్రయాణికులను బయటకు తీసేలోపు మృతుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు. 300 నుంచి 1000 కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. సాధారణంగా ఈ బస్సులు రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట లేదా మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా.. వాటి పనితీరు, సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉన్నాయి. డ్రైవింగ్ సమయంలో తాము నిద్ర మత్తులో ఉంటున్నామని 25శాతం మంది డ్రైవర్లు అంగీకరించినట్లు 2018లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల్లోపు డ్రైవర్లు నిద్రలోకి జారుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. ప్రమాదాల సమయంలో మొదటి రెండు నిమిషాల్లో ప్రతిస్పందించే తీరే అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలోనే ఉంటారు. సీట్లలో మెలకువగా ఉన్నవారు లేదా ప్రమాదం జరిగిన వెంటనే తేరుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక, అప్పర్ బెర్త్‌ల్లో ఉన్నవారు బయటపడటం చాలా క్లిష్టంగా ఉంటోందని అంటున్నారు. ఈ స్లీపర్ బస్సులు తొలుత పశ్చిమదేశాల్లో నడిపేవారు. సిటీల మధ్య వినోద ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. ఆ తర్వాత సాధారణ ప్రజా రవాణాలో ఇవి భాగమయ్యాయి. అయితే, వీటిల్లో జరుగుతోన్న ప్రమాదాల కారణంగా కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నాయి. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 2012లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది.

## పార్క్ స్థలానికి వీడిన చెర

మొదటి పేజీ తరువాయి

అసోసియేషన్ ప్రతినిధుల నుంచి ప్రజావాణికి ఫిర్యాదు అందింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖలతో కలిసి పరిశీలించారు. పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలంగా నిర్ధారించారు. రంగనాథ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ఆ వెంటనే ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ పార్కు స్థలం విలువ దాదాపు రూ. 30 కోట్ల వరకూ ఉంటుందని పేర్కొన్నారు.

## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

మొదటి పేజీ తరువాయి

రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 5 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా




అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## ప్రజల ప్రాణాలతో ట్రావెల్స్ బస్సుల చెలగాటం

మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. బస్ ఘటనలో ఎక్కువ సంఖ్యలో మృతులు ఉండటం విషాదకరమన్నారు. మృతులకు తీవ్ర సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరుకులు

మొదటి పేజీ తరువాయి

మందలించారు. లబ్దిదారులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుకుం జారీ చేశారు. చిన్నారుల సంరక్షణ విషయంలో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన సమయం నుంచి వారు వెళ్లే వరకు సిబ్బంది బాధ్యత వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగు నీటి సదుపాయం, టాయిలెట్ సౌకర్యాల కల్పన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య, హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కనీసం ఒక చిన్నారి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు మంత్రి సీతక్క. ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయనే భరోసాను తల్లిదండ్రులకు కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా ప్రోగ్రెస్ రిపోర్టులు పంపించాలని ఆజ్ఞాపించారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని సూచించారు.

## తెలంగాణ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

1967 ఫారెస్ట్ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

## కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. భయానకమైన ఘటనా స్థలి దృశ్యాలు ప్రమాద స్థాయిని కళ్లకు కడుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్‌నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం.

# రుద్రంగి పీఎస్ పరిధిలో మైనర్ రిమాండ్‌కు తరలింపు

## - శబ్ద కాలుష్యంపై పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఘటన

రుద్రంగి, అక్టోబర్ 24 (ఆకాంక్ష): రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఒక మైనర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని రుద్రంగి ఎస్సై బి. శ్రీనివాస్ మీడియాతో వెల్లడించారు. వివరాల్లోకి వెళితే..తేదీ 21 అక్టోబర్ 2025 న రాత్రి సమయంలో సర్పంచ్ తండా గ్రామంలో డీజే అధిక శబ్దాలతో మోగించడంతో గ్రామ ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఈ పరిస్థితి మీద ఆగ్రహించిన గ్రామస్తులు వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై బి. శ్రీనివాస్ నేతృత్వంలో రుద్రంగి పోలీసులు అక్కడికి చేరుకుని, శబ్ద కాలుష్యాన్ని ఆపాలని అక్కడ ఉన్నవారిని సూచించారు. అయితే ఆ సమయంలో డీజే ఆపడానికి నిరాకరించిన వారిలో ఒక మైనర్ పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై తెలిపారు. దీంతో చట్టపరమైన చర్యల నిమిత్తం ఆ మైనర్‌పై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. శ్రీనివాస్ మాట్లాడుతూ, శబ్ద కాలుష్యంపై ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయము. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పండుగలు, వేడుకల పేరుతో అధిక శబ్దంతో డీజేలు వినిపించడం సామాన్యమైపోయింది. అయితే, అటువంటి శబ్ద కాలుష్యం ప్రజా శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# గ్రూప్-1లో ఎంపికైన అరుణ్ కుమార్‌కు ఘన సన్మానం



మంథని,అక్టోబర్ 24(ఆకాంక్ష) : మంథని మండలం కాన్సాయిపేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ్ కుమార్ టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో అర్హత సాధించి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియామకం పొందగా, గ్రూప్-2లో కూడా డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపిక కావడం గ్రామంలో ఆనందోత్సాహాలను రేపింది. తెలంగాణ ప్రభుత్వం 2022లో విడుదల చేసిన గ్రూప్స్ నోటిఫికేషన్ తర్వాత పట్టుదలతో సిద్ధమై గ్రూప్-%1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల్లోనూ మెరుగైన ర్యాంకులు సాధించిన అరుణ్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వెంకటాపూర్ సెక్టర్ అంగన్వాడీ టీచర్లు అరుణ్ కుమార్ తల్లి తోటి ఉద్యోగిని కావడంతో గర్వభావంతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పూలమాల వేసి అభినందనలు తెలిపారు. తమ అంగన్వాడీ టీచర్ కుమారుడు రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో అగ్రస్థానం పొందడం తమందరికీ గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు హరిత, సంధ్య, రాజేశ్వరి, సత్తక్క, కనకలక్ష్మి, చంద్రకళ, లక్ష్మి, సృజన, మంగ, రాదాబాయి, సునీత, లలిత, రాజక్క, శ్యామల, స్వరూప, అనసూర్య తదితరులు పాల్గొని అరుణ్ కుమార్‌ను అభినందించారు. గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు కూడా ఆయన భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# రైతుల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

బాపట్ల, అక్టోబర్ 24 : పర్చూరు నియోజకవర్గంలోని నాగరాజుపల్లి గ్రామ రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యకు పరిష్కారం లభించింది. రైతులు తమ భూముల పరిమితులు, సరిహద్దుల విషయంలో ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన పర్చూరు శాసనసభ్యులు శ్రీ ఏలూరి సాంబశివరావు గారు స్వయంగా ముందుకు వచ్చి సంబంధిత రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసి, ఆ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలో, చుక్కల భూముల సరి చేయించిన భూసర్వే పత్రాలను ఈరోజు నాగరాజుపల్లి గ్రామ రైతులకు ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ "రైతు కష్టపడితేనే దేశం ఎదుగుతుంది. ప్రతి రైతు న్యాయం పొందే వరకు నా పోరాటం కొనసాగుతుంది" అని తెలిపారు.

# నేను ఎప్పుడూ రౌడీయిజం చేయలేదు.. భూ కబ్జాలు చేయలేదు

## - కడియం శ్రీహరి వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ




వరంగల్.అక్టోబర్ 24(ఆకాంక్ష) : మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. నేను ఎప్పుడూ రౌడీయిజం చేయలేదు, సెటిల్మెంట్లు చేయలేదు, ఎవరినీ బెదిరించి బలవంతపు వసూళ్లు చేయలేదు, భూ కబ్జాలు చేయలేదు అని స్పష్టంగా పేర్కొన్న ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా పరోక్ష విమర్శలుగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ కుటుంబం నుంచి వచ్చిన విమర్శల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల కొండా సురేఖ కూతురు సుస్మితా పటేల్ కడియం శ్రీహరిపై బహిరంగంగా విమర్శలు చేయగా, అంతకు ముందే సురేఖ భర్త కొండా మురళి కడియం కనుబొమ్మలు లేని వ్యక్తి అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల తరువాత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు ఆ కుటుంబానికే పరోక్షంగా ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే దీనిపై మీడియా ప్రశ్నించగా మంత్రి కొండా సురేఖ పదవిని లాక్కోవడానికి మీరు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం ఉందని ప్రశ్నించగా, దానికి సమాధానంగా కడియం శ్రీహరి తన వ్యక్తిత్వం, రాజకీయ ప్రయాణం గురించి వివరించారు. నా రాజకీయ జీవితం ఎన్నో దశాబ్దాలు కొనసాగింది. కానీ నేను ఎప్పుడూ ఎవరి హక్కుల మీద దాడి చేయలేదు, ఎవరినీ బెదిరించి ఏది సాధించలేదు. ప్రజాసేవే నా లక్ష్యంఅని పేర్కొన్నారు. కడియం శ్రీహరి ఈ వ్యాఖ్యలు చేయడానికి గల నేపథ్యం, సమయం రాజకీయంగా గమనార్హంగా మారింది. రాష్ట్రంలో మంత్రి సురేఖతో ఆయన మధ్య ఉద్రిక్తతలు, పార్టీ అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయనే చర్చలు ఉధృతమవుతున్నాయి. కొండా కుటుంబంపై కడియం పరోక్షంగా విమర్శలు చేసినట్లు ప్రతిపక్ష నాయకులు, పక్షపాత విశ్లేషకులు సోషల్ మీడియాలో విశ్లేషణలు చేస్తున్నారు. కడియం శ్రీహరి గతంలో కూడా వరంగల్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, కొండా సురేఖ-మురళి జంటతో రాజకీయంగా పలుమార్లు తలపడ్డారు. ఇప్పుడు మంత్రి పదవిని చుట్టూ తిరుగుతున్న ఈ కొత్త వివాదం వారిద్దరి మధ్య ఉన్న పాత రాజకీయ విభేదాలను మళ్లీ వెలుగులోకి తెచ్చినట్టయింది. ఇక రూలింగ్ పార్టీ వర్గాల్లోనూ కడియం వ్యాఖ్యలపై మిశ్రమ స్పందనలు వినిపిస్తున్నాయి. కొందరు ఆయన మాటలను స్వీయ వివరణగా చూస్తుండగా, మరికొందరు పరోక్ష దాడిగా భావిస్తున్నారు. కొండా సురేఖ వర్గం మాత్రం దీనిపై మౌనం పాటిస్తుండటం గమనార్హం. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నట్లు, కడియం శ్రీహరి మరియు కొండా కుటుంబం మధ్య కొనసాగుతున్న ఈ మౌన యుద్ధం రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని మార్పులకు దారితీయవచ్చని అంచనా వేస్తున్నారు.


# సారంగాపూర్ పోలీస్ స్టేషన్ లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం




జగిత్యాల,అక్టోబర్ 24 (ఆకాంక్ష) : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని పోలీస్ శాఖ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్సై పి.గీత మాట్లాడుతూ... పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెరుగుతుంది. భవిష్యత్తులో సజాగ్రతతో కూడిన పౌరులుగా ఎదగటానికి ఇది దోహదం చేస్తుందని అన్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీస్ శాఖ పనితీరు, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, వైర్లెస్ సెట్ ద్వారా సమాచార మార్పిడి, పోలీస్ లాకప్ వ్యవస్థ, సీసీ కెమెరాల మానిటరింగ్ విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల విధానం, డయల్ 100 సేవలు, రిసెప్షన్ విధానం, పాత నేరస్తులను గుర్తించేందుకు ఫింగర్ ప్రింట్ వ్యవస్థ, పోలీస్ ఆయుధాల వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. అదే విధంగా పోలీస్ శాఖలోని భరోసా సెంటర్, షీ టీమ్ కార్యకలాపాలు, సంఘవిద్రోహ శక్తుల చేతిలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు పరిచయం చేశారు. పోలీస్ వ్యవస్థ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎప్పుడు ఎక్కడైనా ప్రజల భద్రతకు అంకితభావంతో పనిచేస్తుందని వివరించారు. విద్యార్థులు ప్రశ్నలు అడిగి పోలీస్ సిబ్బంది నుండి సమాధానాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, అది సమాజానికి ఎలా సేవ చేస్తుంది, ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో దాని పాత్ర ఏమిటి అన్న అంశాలపై స్పష్టమైన అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.గీతతో పాటు సిబ్బంది, స్థానిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గంగాపురి శివారులో పేకాటరాయుళ్ల అరెస్ట్

## - నలుగురు అదుపులోకి, నగదు స్వాధీనం




మంథని.అక్టోబర్ 24(ఆకాంక్ష) : మంథని పట్టణ పరిధిలో జూదకార్యకలాపాలపై పోలీసులు దాడులు కొనసాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం మంథని పురపాలక పరిధిలోని గంగాపురి శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని మంథని పోలీస్ స్టేషన్ ఎస్సై దేగ రమేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గంగాపురి శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని దాడి జరిపినట్లు తెలిపారు. దాడిలో ఎం.సతీష్, ఓ.అజయ్, డి.రాజశేఖర్, ఇ.రాజశేఖర్ అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని వివరించారు. వారి వద్ద నుండి రూ.8,150 నగదు, నలుగు మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడిన వారిపై సంబంధిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు చెప్పారు. మంథని పరిధిలో ఇటీవలి కాలంలో పేకాట, గ్యాంబ్లింగ్ వంటి అక్రమ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమై ఉందని ఆయన పేర్కొన్నారు. డబ్బులు పెట్టి పేకాట ఆడేవారిపై చట్టరీత్య కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండి శాంతిభద్రతలకు సహకరించాలని ఎస్సై రమేష్ పిలుపునిచ్చారు.



# రోడ్డు ప్రమాద మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకుడు ఆవుల రాజిరెడ్డి

మెదక్. అక్టోబర్ 24(ఆకాంక్ష) : చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన మంగలి దుర్గాప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీన దురదృష్టవశాత్తు మరణించాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం నూరిపోశారు. దుర్గాప్రసాద్ కుటుంబానికి సాంత్వన తెలుపుతూ, ఈ క్లిష్ట సమయంలో పార్టీ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాజిరెడ్డి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గాజుబోయిన అశోక్, ఉపాధ్యక్షుడు నాగోనీ శేఖర్ గౌడ్, దార ప్రకాష్, వడ్ల లక్ష్మిపతి, పంతుల సంగమేశ్వర్, మోర శేఖర్, అంకమ్మ నరసింహులు, నాయి కోటి రమేష్, పుల్లబోయిన నాగేష్, మోర లక్ష్మయ్య, నేత సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో యువతి మృతి




ఓదెల.అక్టోబర్ 24(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూపు నారాయణపేట గ్రామంలో జరిగిన విషాద ఘటన గ్రామస్థుల హృదయాలను కదిలించింది. పాము కాటుతో ఓ డిగ్రీ విద్యార్థిని దుర్మరణం పాలయ్యింది. వివరాల్లోకి వెళ్తే, గ్రామానికి చెందిన గుర్రం శ్రీను, కోమల దంపతుల పెద్ద కుమార్తె గుర్రం అక్షిత (18) మహాత్మా జ్యోతిరావు ఫూలే విద్యాసంస్థల్లో బీకాం కంప్యూటర్స్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. చదువులో ముందంజలో ఉండే అక్షిత దీపావళి సెలవుల సందర్భంగా కొద్దిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా పుస్తకాలు చదువుకుంటూ ఉండగా ఆకస్మాత్తుగా ఓ విషపాము కాటేసింది. కేకలు విన్న కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు విడిచింది. తండ్రి శ్రీను వికలాంగుడు కాగా, తల్లి కోమల రెక్కల కష్టంతో కుటుంబ పోషణ చేస్తూ వస్తున్నారు. అక్షిత తమ కుటుంబానికి ఆదరణగా ఎదుగుతుందని ఆశించిన తల్లిదండ్రులు కుమార్తె మృతితో విషాదంలో మునిగిపోయారు. ఒక్కసారిగా పసిపాపల నవ్వులు, యువతి కబుర్లు కనపడకపోవడంతో గ్రామమంతా విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, బంధుమిత్రులు అక్షిత మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థిని మృతితో మొత్తం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

# ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్య సమితి స్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు

ములుగు జిల్లా,ఏటూరు నాగారం,అక్టోబర్ 24 : కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. రేణుక గారు అధ్యక్షత వహించగా, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి కె. రమేశ్ గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. బి. రేణుక గారు మాట్లాడుతూ ం "ప్రపంచ శాంతి, అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణలో యూనో పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగింది. విద్యార్థులు ప్రపంచ పౌరులుగా ఆలోచిస్తూ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి" అని తెలిపారు. రాజనీతి శాస్త్ర విభాగధిపతి కె. రమేష్ గారూ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి యొక్క చరిత్ర, అంతర్జాతీయ ప్రాధాన్యతపై మరియు దాని ప్రధాన అంగాల గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు యూనో యొక్క చరిత్ర, లక్ష్యాలు, అంతర్జాతీయ ప్రాధాన్యతపై ప్రసంగాలు చేసి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి కొనసాగించాలి - డా. బ్లెస్సీ

## - టీబీ ముక్త్ భారత్ అభియాన్ అమలుపై ముల్కనూర్ పీహెచ్సీలో సమీక్ష



భీమదేవరపల్లి, అక్టోబర్ 24 (ఆకాంక్ష న్యూస్) : వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూ హెచ్ఓ) క్షయ వ్యాధి సలహాదారు డాక్టర్ బ్లెస్సీ శుక్రవారం ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు జరిగిన కార్యకలాపాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో తేమడ (స్పుటమ్) పరీక్షలు నిర్వహించే ప్రయోగశాలను (ల్యాబ్) పరిశీలించి, పరీక్షల తీరును తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, టీబీ నోడల్ పర్సన్ రాజయ్య, ల్యాబ్ ఇన్‌చార్జ్ సురేందర్, సిబ్బంది మల్లీశ్వరి, జ్యోతి, రత్న భారతి, రాజు, వనజ, స్వరూప, రాజేందర్, రవి, సంపత్, ఆశ పుల్లీ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ను మర్యాదపూర్వకంగా

# వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

వర్ధన్నపేట/అక్టోబర్ 24/(ఆకాంక్ష న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ & కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగరాగారి ప్రీతీమ్ ఇటీవల అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం నేషనల్ కో ఆర్డినేటర్ గా నియమితులైన శుభసందర్భంగా ఈ రోజు హైదరాబాద్ లోని వారి స్వ గృహములో కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం రాష్ట్ర నాయకులు & వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమందించి శాలువాతో సన్మానించి హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో వరంగల్ ఉమ్మడి జిల్లాల ఎస్సీ విభాగం ఇంచార్జి దబ్బెట రమేష్ , ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్షం అశోక్ ,ఎస్సీ విభాగం జిల్లా నాయకులు ఆరూరి సాంబయ్య లు పాల్గొనడం జరిగింది.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో పాలకుర్తి బిఆర్ఎస్ సైన్యం



జనగాం జిల్లా/ పాలకుర్తి అక్టోబర్, 24(ఆకాంక్ష న్యూస్): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్ఎస్ సైన్యం ముమ్మరంగా ప్రచారం చేస్తుంది. మాగంటి సునీత గోపినాథ్ గెలుపు కోసం పాలకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ సైన్యం గడప గడపకు వెళ్తూ ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ మధుర నగర్ లో ప్రతి ఇంటికి పాలకుర్తి మండల పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్ , ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి వెళ్ళి కాంగ్రెస్ మోసపూరిత హామీల గురించి ఓటర్లలో అవగాహన కల్పిస్తూ, బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ ముమ్మరంగా ప్రసారం చేస్తున్నారు. మాగంటి సునీత గోపినాథ్ గెలుపు ఖాయం అని భారీ మెజారిటీ కోసం ప్రచారం చేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కత్తి సైదులు (మాజీ సర్పంచ్), గడ్డం హరి,లకావత్ వెంకట్ నాయక్, సారంగం మరి నాయకులు పాల్గొన్నారు.

# నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నరేందర్



గోదావరిఖని.అక్టోబర్24(ఆకాంక్ష) : రామగుండంలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో పాలనాపరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ నరేందర్ కొత్తగా కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ హిమబిందును పదవి నుండి తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సిమ్స్ నిర్వహణలో, ముఖ్యంగా పరిపాలనా వ్యవహారాల్లో అనేక అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న హిమబిందుపై గతంలోనూ అంతర్గత విచారణలు జరిగాయి. అయితే ఇటీవల మళ్లీ సిబ్బంది, వైద్యులు సమిష్టిగా ప్రిన్సిపల్ హిమబిందు వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రిన్సిపల్ హిమబిందు నిర్ణయాలు ఏకపక్షంగా, పాక్షికతతో ఉన్నాయని, కళాశాల అభివృద్ధి కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. ఇది ఇలా ఉంటే ఓ డ్రైవర్ నియామకాలు, కాంట్రాక్ట్ సేవలు, ఆసుపత్రి సామాగ్రి కొనుగోళ్లలోనూ చేతివాటం ప్రదర్శించి అవకతవకలకు పాల్పడినట్లు గతంలో ఎన్నో ఫిర్యాదులు వచ్చిన ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సిమ్స్‌లో ఇటీవల గత కొన్ని నెలలుగా అసంతృప్తి వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ప్రభుత్వం తక్షణ చర్యగా హిమబిందును తప్పించి డాక్టర్ నరేందర్‌ను ప్రిన్సిపల్‌గా నియమించింది. ఈ మార్పును కొంత మంది సిబ్బంది, వైద్యులు, విద్యార్థులు సంతోషంగా స్వాగతించారు. కొత్త ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్ మాట్లాడుతూ... సిమ్స్‌ను రాష్ట్రంలో అగ్రశ్రేణి వైద్య విద్యాసంస్థగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. సిబ్బందంతా ఐక్యంగా పని చేస్తే అభివృద్ధి సాధ్యం అని తెలిపారు. ఇక హిమబిందు తొలగింపు నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బంది మధ్య ఊరట వ్యక్తమవుతోంది. ఇకపోతే హిమబిందు తొలగింపుతో పాటు ఆమెపై ఉన్న అవినీతి ఆరోపణలపై మరింత దర్యాప్తు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. అధికార వర్గాలు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నాట్లు ప్రచారం జరుగుతుంది. సిమ్స్ ప్రిన్సిపల్ మార్పుతో రామగుండం వైద్య వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. ఒకవైపు పరిపాలనలో పారదర్శకతకు కొత్త ఆరంభం అవుతుందనే ఆశాభావం వ్యక్తం అవుతుంది. అయితే, ఇప్పుడు మొత్తం దృష్టి కొత్త ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్ వైపు మళ్లింది. ఆయన నేతృత్వంలో సిమ్స్ మళ్లీ శాంతి, సమర్థత వైపు అడుగులు వేస్తుందని సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్కరణ పురస్కరించుకొని రక్తదానం చేసిన కేయూ విద్యార్థులు



హన్మకొండ/వరంగల్,కెయు ,అక్టోబర్ 24(ఆకాంక్ష న్యూస్): రక్తదానంతో మరో ముగ్గురి ప్రాణాలు కాపాడచ్చు రక్త దానం చేయడం ద్వారా మరో ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడగలమని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వరంగల్ పోలీస్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్సీ రాజు నాయక్ గారు మరియు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు అంతర్జాతీయ క్రీడాకారుడు కాకతీయ యూనివర్సిటీ జేఏసీ లీడర్ ఇస్లావత్ ఆలోజీ నాయక్, విద్యార్థి నాయకులు అశోక్, సుధీర్ నాయక్,యాదగిరి, శ్రీకాంత్, బహదూర్ సింగ్,చరణ్ తదితరులు రక్తదానం చేశారు. వీరికి సిపి మరియు కేయు సిఐ రవి సార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పండ్లను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులను స్మరిస్తూ రక్త దానం చేసేందుకు స్వచ్చందంగా ముందుకు వచ్చిన ప్రజలకు అభినందనలు, శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను స్మరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిపి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ సీఐ రవి సార్ గారు, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ సార్ గారు. ఎస్సై రవీందర్ సార్ గారు సూచన మేరకు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ఈరోజు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సోమన్న ఆలయానికి కొబ్బరి చిప్పల వేలం ద్వారా రూ.5,41,116 లక్షల ఆదాయం

## - గత ఏడాది కంటే రూ.39,116 పెరిగిన ఆదాయం



జనగామ జిల్లా /పాలకుర్తి అక్టోబర్ ,24 (ఆకాంక్ష న్యూస్): పాలకుర్తి మండల కేంద్రంలోని స్వయంభువు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో 2025-2026 సంవత్సరం కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా రూ.5,41,116 దేవాలయానికి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు తెలిపారు. ఆలయ కళ్యాణ మండపంలో సీల్ టెండర్ కం. వేలం పాట నిర్వహించగా జఫర్గడ్ మండల కేంద్రం చెందిన తాటికాయల ఎల్లయ్య కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం రూ.5,41,116,లక్షల హెచ్చు పాట పాడి హక్కు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే అదనంగా రూ.39,116 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు., కొబ్బరికాయలు పూజా ద్రవ్యములు అమ్ముకునే హక్కు (అభిషేకం, వాహన పూజ సామాగ్రి మినహాయించి), తలనీలాలు పోగు చేసుకోను హక్కు తీసుకొనుటకు ఎవరు టెండర్ షెడ్యూల్ కొనుగోలు చేయకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. దేవాలయ ధర్మాదాశాఖ బోనగిరి ఇన్స్పెక్టర్ నిఖిల్, ఆలయ సూపరిండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న శర్మ, పాటదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.




# కాంగ్రెస్ ను వీడి తెలంగాణ జాగృతిలోకి భారీ చేరికలు

రంగారెడ్డి జిల్లా,మహేశ్వరం నియోజకవర్గం ,అక్టోబర్ 24 (ఆకాంక్ష న్యూస్): మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని కందుకూరు గ్రామం నుండి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క సమక్షంలో మహేశ్వరం నియోజకవర్గం తెలంగాణ జాగృతి ఇంచార్జి అందుగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ను వీడి తెలంగాణ జాగృతిలోకి సుమారుగా 50 మంది వరకు చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు అర్చన సేనాపతి, రాష్ట్ర నాయకుడు కోల శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు లావణ్య, భవాని, సుజాత, స్వాతి, జగన్, ఉండేలా బాబురావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఆ కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందుగుల సత్యనారాయణ... రాయకంటి జగన్ కు కందుకూరు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించడం జరిగింది.

# కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధనా స్కాలర్‌కు సోషల్ వర్క్‌లో పిహెచ్‌డి అవార్డు ప్రదానం





OFFICE OF THE CONTROLLER OF EXAMINATIONS
KAKATIYA UNIVERSITY
WARANGAL - 506 009 (TELANGANA)
(Accredited with A+ Grade by NAAC)

No. 73 /Ph.D./E1/KU/2025 Date: 22-10-2025

PRESS NOTE

Mr/Ms. **Bathini Vani**, Research Scholar in **Social Work**, Kakatiya University, Warangal, who has presented the thesis entitled **"HEALTH SEEKING BEHAVIOUR AMONG KOYA TRIBE WOMEN IN ETURUNAGARAM ITDA OF TELANGANA STATE - A STUDY"** has been declared qualified for the Degree of **Doctor of Philosophy** (Ph.D) in **Social Work** of Kakatiya University.

"By Order"
CONTROLLER OF EXAMINATIONS

Copy forwarded for information to:

1. The Registrar, Kakatiya University, Warangal.
2. The Secretary, University Grants Commission, New Delhi-110 002.
3. The Editor, University News, A.I.U., 16 Kotla Marg, New Delhi-110 002.
4. The Dean, Faculty of Social Sciences, KU, Warangal.
5. The Coordinating Officer, U.G.C. Unit, Kakatiya University, Warangal.
6. The Principal, University College , K.U.Wgl.
7. The Chairperson, Board of Studies in Sociology&Social Work, K.U., Wgl.
8. The Head, Department of Sociology&Social Work, KU, Wgl.
9. The E X A M I N E R.
10. **Prof. T. Ramesh(Retd.,)** (Supervisor), Department of Sociology&Social Work, KU,Wgl.
11. The Nodal Officer, Kakatiya University, Warangal.
12. The Member-in-Charge, University Library, Kakatiya University, Warangal.
13. The Deputy Registrar (Admn.), Kakatiya University, Warangal.
14. The Public Relations Officer, Kakatiya University, Warangal.
15. The Secretary to Vice-Chancellor, Kakatiya University, Warangal.
16. The Documentation Section (E5), Examination Branch, KU, Warangal.
17. The Person concerned (**Bathini Vani** S/D/o. **Bathini Shankar**).

[Press Note No.4549]

***

వరంగల్ /హన్మకొండ,అక్టోబర్ 24(ఆకాంక్ష న్యూస్): సోషల్ వర్క్ విభాగానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ శ్రీమతి బత్తినీ వాణి సోషల్ వర్క్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) డిగ్రీకి అర్హత సాధించినట్లు కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల కంట్రోలర్ కార్యాలయం ప్రకటించింది. "తెలంగాణ రాష్ట్ర ఐటీడీఏలోని ఏటూరునాగారంలో కోయ తెగ మహిళలలో ఆరోగ్యాన్ని కోరుకునే ప్రవర్తన – ఒక అధ్యయనం" అనే ఆమె డాక్టరల్ థీసిస్ ఏటూరునాగారం ప్రాంతంలోని కోయ గిరిజన మహిళల ఆరోగ్య సంరక్షణ విధానాలు మరియు ప్రవర్తనా అంశాలను అన్వేషిస్తుంది. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విసి ప్రొఫెసర్ టి. రమేష్ (రిటైర్డ్) పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. శ్రీమతి వాణి పిహెచ్‌డి అర్హతలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పరీక్షల కంట్రోలర్ అధికారికంగా ప్రకటిస్తూ ప్రెస్ నోట్ విడుదల చేశారు. నోటిఫికేషన్ కాపీలను రిజిస్ట్రార్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (%ఖ+జ%), యూనివర్సిటీ న్యూస్ మరియు ఇతర సంబంధిత అధికారులకు రికార్డు మరియు ప్రచురణ కోసం పంపారు. ఈ విజయం కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా నైపుణ్యం మరియు సామాజిక పరిశోధనలకు, ముఖ్యంగా గిరిజన మరియు సమాజ సంక్షేమ రంగంలో నిరంతర సహకారాన్ని హైలైట్ చేస్తుంది.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు




వరంగల్,భద్రకాళి దేవాలయం,అక్టోబర్ 24(ఆకాంక్ష న్యూస్): అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ నూతన (రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్) శ్రీమతి సుమ గారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందచేశారు.







# ప్రమాదంలో మొత్తం 19 మంది మృతి



- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- క్షతగాత్రులకు మంత్రులు అనిత తదితరుల పరామర్శ
- మృతుల కుటుంబాలకు 5లక్షలు... క్షతగాత్రులకు 2 లక్షల పరిహారం
- డిఎన్ఎ పరీక్షల ఆధారంగా ఆనవాళ్లు అప్పగింత
- డ్రైవర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన హోంమంత్రి అనిత

కర్నూలు, అక్టోబర్ 24 : బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారని వెల్లడించారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో మంత్రులు అనిత, రాం ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బస్సు డ్రైవర్లిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డుపై పడి ఉన్న బైకును ఢీ కొట్టినట్లు బస్సు డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ చెప్పాడు. ప్రమాదానికి గల కారాణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని ఎస్పీ వివరించారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వారిని మంత్రులు పరామర్శించి వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మంత్రుల వెంట డీజీపీ హరీశ్ గుప్తా, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, దస్తగిరి ఉన్నారు.

# సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

## - పెళ్లికి ఆహ్వానిస్తూ పత్రిక అందచేత

హైదరాబాద్, అక్టోబర్ 24 :టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ బ్యాచిలర్ లైఫ్ కు గుడ్ బై చెప్పనున్నారు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. నటి శిరీష లేళ్లతో వివాహ బంధంలో అడుగుపెట్టనున్నారు. నారా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న నారా రోహిత్.. శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన వివాహానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నారా రోహిత్–శిరీషల వివాహం ఈ నెల అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహ వేడుకలను ఏకంగా నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నారా కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 25న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. అక్టోబర్ 26న సంప్రదాయబద్ధంగా పెళ్లికొడుకు కార్యక్రమం జరగనుంది. అక్టోబర్ 28న మెహందీ వేడుక, 29న సంగీత్ నైట్ నిర్వహించనున్నారు. చివరగా, అక్టోబర్ 30న రాత్రి 10:35 గంటలకు శుభ ముహూర్తాన రోహిత్, శిరీష ఒక్కటవ్వనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు – భువనేశ్వరి దంపతులు పెద్దలుగా ఈ వివాహ వేడుకలో పాల్గొననున్నారు. రోహిత్, శిరీషల పరిచయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వారిద్దరూ కలిసి నటించిన 'ప్రతినిధి?2' సినిమా షూటింగ్



సమయంలోనే స్నేహం ఏర్పడింది. అది క్రమంగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, నిశ్చితార్థం జరిగిన కొద్ది కాలానికే రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూయడంతో పెళ్లిని వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి తేదీ ఖరారు చేశారు.సినీ పరిశ్రమలోఈవివాహం'ఈ ఏడాది అత్యంత ఆకర్షణీయమైన స్టార్ వెడ్డింగ్'గా నిలవనుంది.

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

## - తుది జాబితా ప్రకటించిన ఎన్నికల అధికారి - నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# పాముకాటుకు గురై డిగ్రీ విద్యార్థి మృతి

## కేసు నమోదు చేసిన పోలీసులు

(ఆకాంక్ష న్యూస్)

పెద్దపల్లి, అక్టోబర్ 24 : దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన డిగ్రీ విద్యార్థిని పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోరూపు నారాయణపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రం అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థినికి శుక్రవారం పాముకాటుకు గురై మృత్యువాత పడింది. అక్షిత సుల్తానాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతోంది. దీపావళి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. శుక్రవారం కాలేజీకి పోతా అంటే తల్లి శుక్రవారం రోజు ఎందుకు వద్దు అనడంతో ఇంటి వద్దనే ఉండిపోయింది. తండ్రి శ్రీనివాస్ దివ్యాంగుడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో తల్లి కోమల కూలీ చేస్తేనే కుటుంబ పోషణ సాగుతుంది. దీంతో బిడ్డను ఇంటి వద్ద ఉంచి తల్లి పత్తి పంటను ఏరెందుకు కూలికి వెళ్ళింది. ఇంటి వద్ద అక్షిత కుర్చీలో కూర్చొని హోంవర్క్ చేసుకుంటుండగా పాము కాలుకు కాటు వేసింది. దీంతో వెంటనే తేరుకుని తనను ఏదో కుట్టిందని అరవడంతో ఇంటి పరిసర ప్రాంత ప్రజలు పరిగెత్తుకు వచ్చి చూడగా కుర్చీ కింద పాము ఉన్నట్లు గుర్తించారు. పామును కొడదామని లోపే అక్కడి నుంచి పారిపోయింది. విషయం తల్లికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో ఇంటికి వచ్చి అక్షితను మొదటగా తీసుకువెళ్లి అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. డిగ్రీ విద్యార్థి పాముకాటుతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదం నింపింది. తల్లి, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. శ్రీనివాస్ గౌడ్, కోమల దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా అక్షిత పెద్దది. ఈ మేరకు పోత్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

హైదరాబాద్, అక్టోబర్ 24 : ఆస్ట్రేలియాలో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా విక్టోరియా పార్లమెం ట్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్న మెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఘన స్వాగతం పలికారు. శాసన ప్రక్రియలు, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీపై సుదీర్ఘంగా చర్చించారు. పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పౌరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. టెక్నాలజీ ఆధారిత, పౌర కేంద్రిత పాలన వైపు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ విక్టోరియా ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ పెంచేందుకు చొరవ చూపుతామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను విక్టోరియా ప్రతినిధులకు మంత్రి వివరించారు.ఇక... రాష్ట్రంపై విక్టోరియా నేతలు ప్రశంసల వర్షం కురిపించారు.

# బస్సులోంచి దూకి బతికిన సుబ్రమణ్యం

## - ప్రాణాలు కాపాడుకున్న బిక్కవోలు గంగాధర్ రెడ్డి

(ఆకాంక్ష న్యూస్)

కర్నూలు, అక్టోబర్ 24 : కర్నూలు బస్సు ప్రమాదం నుంచి కాకినాడకు చెందిన సుబ్రహ్మణ్యం సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం కర్నూలులోని ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. 'బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున పొగ కమ్మేయడంతో గందరగోళం ఏర్పడింది. చీకట్లో ఏదీ సరిగ్గా కనబడలేదన్నారు. వెనుక వైపు అద్దం నుంచి అతికష్టం మీద దూకాం' అని సుబ్రహ్మణం తెలిపారు. ఇకపోతే ప్రమాదంలో కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన శ్రీనివాసరెడ్డి (39) మృతి చెందాడు. ఊబలంకకు చెందిన శ్రీనివాస్ రెడ్డి క్రేన్ బిజినెస్‌లు ఉన్నాయి. అతని పక్కనే కూర్చున్న యూపికి చెందిన పంకజ్ కూడా మృతి చెందాడని భావిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుక చెందిన మల్లిడి గంగాధర్ రెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు.

# నెల్లూరు జిల్లాకు చెందిన నలుగురు మృతి

## గొల్లరమేశ్ కుటుంబం సజీవదహనం

(ఆకాంక్ష న్యూస్)

కర్నూలు, అక్టోబర్ 24 : కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం అనేక కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గొల్లవారిపల్లిలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. గొల్ల రమేశ్ సహా నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంలో గొల్ల రమేశ్ (35), ఆయన భార్య అనూష (30), కుమార్తె మన్విత (10), కుమారుడు మనీశ్ (12) మృతి చెందారు. బంధువులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. బస్సు బైక్‌ను ఢీకొట్టిన తర్వాత ద్విచక్రవాహనం బస్సు కిందకు దూసుకెళ్లడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో పలువురు సజీవదహనమయ్యారు.

# కర్నూలు జిల్లా బస్సు దుర్ఘటన

## - కావేరీ యాజమాన్యంతో పాటు డ్రైవర్‌పై కేసు

(ఆకాంక్ష న్యూస్)

కర్నూలు, అక్టోబర్ 24 : కర్నూలు జిల్లా బస్సు దహన ఘటనకు సంబంధించి కావేరీ ట్రావెల్స్ బస్సు యాజమాన్యం, డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్యలపై కర్నూలు జిల్లా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ బస్సులో ప్రయాణించిన ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు పెట్టారు. ఇప్పటికే ఆ బస్సుకి చెందిన ఒక డ్రైవర్ శివ నారాయణ పోలీసుల అదుపులో ఉన్నారు. అయితే, పరారీలో మరో డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య ఉన్నారు. ముత్యాల లక్ష్మయ్యపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. బస్సు ప్రమాదంలో 19 మంది ప్రయాణికుల మృతికి కారణమయ్యారని కావేరి బస్సు యాజమాన్యం, డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్యలపై పోలీసులు కేసులు పెట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా డీఐజీ కోయ ప్రవీణ్ సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. బస్సు ప్రమాద ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు చిన్నటేకూరు వద్ద మంటల్లో కాలిపోయింది. బైక్ ఢీకొనడంతో మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో 19 మంది ప్రయాణికులు, ఒక బైకర్ మృతిచెందారు. ఈ ప్రమాదంలో మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులకి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# పొగ కమ్ముకోవడంతో స్పృహ కోల్పోయి ఉంటారు

## - తరవాత మంట్లలో కాలి బూడిదయ్యారు
## - ఫోరెన్సిక్ నిపుణుడు అలీఖాన్ విశ్లేషణ

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలు బస్సు ప్రమాదం జరిగిన తీరును ఫోరెన్సిక్ నిపుణుడు అలీఖాన్ విశ్లేషించి పలు వివరాలు వెల్లడించారు. బైక్ బస్సు కిందకు దూసుకెళ్లడం వల్ల బైక్ నుంచి లీక్ అయిన పెట్రోల్‌తో మంటలు చెలరేగి ఉంటాయన్నారు. అయితే బస్సులోని కార్గో అంటుకోవడం వల్లే మంటలు ఎక్కువగా వ్యాపించి ఉండొచ్చని తెలిపారు. బస్సులో చోటు తక్కువగా ఉండటం వల్ల ప్రయాణికులు బయటకు రావడానికి ఎక్కువగా అవకాశం ఉండదన్నారు. పాలీయూరీతిన్ ఫోమ్ కాలడం వల్ల విషపూరిత పొగ వ్యాపించి ప్రయాణికులు స్పృహ కోల్పోవచ్చన్నారు. అందువల్ల చాలా మంది ప్రయాణికులు అక్కడే అగ్నికి ఆహుతై ఉంటారని అలీఖాన్ విశ్లేషించారు.

# బస్సుప్రమాద ఘటపై సమగ్ర విచారణ

## - ప్రమాదంపై మంత్రి పొన్నం దిగ్భ్రాంతి

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలు బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ చేస్తున్నామని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరిన నేపథ్యంలో.. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు బస్సుల వేగ నియంత్రణకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ఘటనపట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# బస్సు దుర్ఘటనపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దిగ్భ్రాంతి

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 24 : కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం.. రహదారులపై భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తోందన్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో శుక్రవారం వేమూరి కావేరి మంటలు చెలరేగాయి. బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు.

# కాలిన బస్సును తొలగించే క్రమంలో అపశృతి

## - క్రేన్ పక్కకు ఒరగడంతో డ్రైవర్‌కు గాయాలు

(ఆకాంక్ష న్యూస్)

కర్నూలు, అక్టోబర్ 24 :కర్నూలు శివారులోని చిన్నటేకూరు సమీపంలో బస్సు ప్రమాదం జరిగిన స్థలంలో మరో దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సును పక్కకు తీస్తుండగా క్రేన్‌బోల్తా పడింది. ఈ ఘటనలో క్రేన్ డ్రైవర్‌కు గాయలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాలిన బస్‌ను తప్పించేందుకు క్రేన్‌ను రప్పించారు. అయితే బస్సును తీసే క్రమంలో ఒక్కసారిగా క్రేన్ పక్కకు ఒరిగింది. దీంతో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు శుక్రవారం తెల్లవారు జామున ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. బైకును ఢీ కొని మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు.

# సిమ్స్ ప్రిన్సిపాల్ హిమ బింద్ సింగ్‌పై వేటు

## - బాధ్యతల నుండి తప్పిస్తు వైద్య శాఖ ఉత్తర్వులు

## - ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి. నరేందర్ నియామకం




(ఆకాంక్ష న్యూస్)

కోల్‌సిటి (గోదావరిఖని), అక్టోబర్ 24 : రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి తలమానికంగా ఉన్న సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) దేశవ్యాప్తంగా మంచి ప్రమాణాలు ఉన్నట్లు గుర్తింపు పొందడంతో ఈ కళాశాలను మెడికల్ విద్యార్థులు ఎంపిక చేసుకుంటున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాసింగ్ ఈ మెడికల్ కళాశాలలో అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దడానికి ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. అందులో భాగంగానే ఎల్బీనగర్‌లో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ కూడా ఏర్పాటు కానున్నది. పారా మెడికల్ కోర్సులు మంజూరు అయ్యాయి. ఇదిలా ఉండగా మెడికల్ విభాగంలో పీజీ కోర్సులు కూడా రానున్నాయి. నిత్యం పెద్ద ఎత్తున ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పేషెంట్లు కూడా రావడం జరుగుతుంది. ఇదంతా నానానికి ఒకవైపు కాగా మరోవైపు పరిస్థితి చూస్తే ఇక్కడికి వైద్య సేవలు అందించడానికి వైద్యులు రావడానికి సంకోచించే పరిస్థితి తలెత్తుతుందన్న విమర్శలు కూడా వినవచ్చాయి. దీనంతటికీ కారణంగా నియంతలాగా వ్యవహరిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమాభిందు సింగ్ వ్యవహార శైలి కారణమని కూడా ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఆమె వ్యవహరిస్తున్న ధోరణి నచ్చక కొంత మంది హెచ్ఆర్సీని కూడా ఆశ్రయించి నట్లు ప్రచారం కొనసాగుతోంది. కర్ణుడి చావుకు సవా లక్ష కారణాలు అన్న చందంగా ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలతో ఎట్టకేలకు వైద్యశాఖ చర్యలు తీసుకుంది. ఆమెను కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలను తప్పిస్తూ వైద్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఆమె స్థానంలో మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ జి. నరేందర్‌ను సిమ్స్ ప్రిన్సిపాల్‌గా నియమించారు.కాగా ఆమెను అదే కళాశాలలో కొనసాగిస్తూ పీడియాట్రిక్ విభాగంలో హెచ్వోడి అదే కళాశాలలో కొనసాగిస్తూ పీడియాట్రిక్ విభాగంలో హెచ్‌ఓడిగా నియమించారు. డిఎంఈ నివేదికలో హిమభింద్ సింగ్ పై చర్యలు తీసుకున్నట్లు జీవో కాఫీ 500లో ప్రభుత్వం స్పష్టంగా తేల్చి చెప్పింది. ఆమె భర్త డాక్టర్ దయాల్ సింగ్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ పనిచేస్తున్నారు. ఆయన అమాయకంగా వ్యవహరించడంతో ఆమె సిమ్స్‌తో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా పెత్తనాన్ని కొనసాగించిందన్నా విమర్శలు వచ్చాయి. ఆసుపత్రిలో ఉద్యోగులు సిబ్బందిపై కూడా ఆమె దురుసుగా ప్రవర్తించడం జరిగిందన్నా ఆరోపణలు వెల్లి విరిసాయి. కళాశాలలో జరిగిన నియామకాల్లో కూడా ఆమె ప్రమేయం ఉన్నట్లు ప్రచారం జరిగింది. సిబ్బంది వేతనాలు బిల్లుల విషయంలో కూడా ఆమెపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. కాంట్రాక్టర్లను సైతం కూడా వేధించినట్లు ఆరోపణలు కూడా వినవచ్చాయి. దీనికి తోడు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది అందరూ పెద్ద ఎత్తున ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. డిఎంఏ ఈమెపై వస్తున్న ఆరోపణలపై నివేదికలు తెప్పించుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతానికైతే ఆమెను స్థాన చలనం చేయకుండా అదే కళాశాలలో కొనసాగించడం వెనక ఉన్న మతలబు ఏంటి అనేది కూడా ప్రశ్నార్థకమైంది.



# ప్రజలకు మరింత చేరువలో యూనియన్ బ్యాంక్ సేవలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ఆకాంక్ష న్యూస్)

మంచిర్యాల, అక్టోబర్ 24 : ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ కార్యాలయాన్ని సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ (ఎజిఎం) రాధాకృష్ణ, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, శాఖ మేనేజర్ సంజీవ్ తలకోటిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గద్దెరాగడి శాఖ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా ప్రజలకు, బ్యాంకు వినియోగదారులకు బ్యాంకు సేవలను మరింత అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. పొదుపు, బీమా, పెన్షన్, పెట్టుబడులు ఇతర అనేక అంశాలలో ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని, ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. శాఖ కార్యాలయం అభివృద్ధికి బ్యాంక్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, తద్వారా జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ఆకాంక్ష న్యూస్)

మంచిర్యాల, అక్టోబర్ 24 : మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలు, పారిశుధ్య నిర్వహణ అంశాలను మున్సిపల్ కమిషనర్ రాజు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా వార్డులలోని ప్రతి ఇంటి నుండి ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. ప్రతి ఇంటికి ఎలాంటి అంతరాయం లేకుండా త్రాగునీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలలో నాటేందుకు అవసరమైన మొక్కలను అభివృద్ధి చేయాలని, మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రెండు పడకగదుల ఇండ్ల పథకంలో భాగంగా నిర్మించిన భవనాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న



నీటి బ్యాంకుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, త్రాగునీటి సరఫరా, రెండు పడక గదుల ఇండ్ల పథకం నిర్వహణపై సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# భగీరథుడి పట్టుదల అందరిలో ఉండాలి

## - నాకు భగీరథుడే ఆదర్శం ఎమ్మెల్యే మేఘారెడ్డి

(ఆకాంక్ష న్యూస్)

వనపర్తి, అక్టోబర్ 24 :పట్టుదలలో భగీరథుడే ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉం డాలని... నేను ఎల్లవేళలా భగీరథ మహర్షినే ఆదర్శంగా తీసుకుంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుబడి ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ రిజర్వేషన్ తెలంగాణలో అమలుపరిచి దేశానికే రోల్డ్ మాడల్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం సగరులకు అవకాశం ఉన్నచోట గుర్తింపుని ఇస్తామన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో 20 లక్షల రూపాయలతో సగరుల సామూహిక భవనాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సగర సంగం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని పత్తి రైతులు రెండు రోజులు ఆగి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

(ఆకాంక్ష న్యూస్)

మంచిర్యాల, అక్టోబర్ 24 : అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని పత్తి రైతులు రెండు మూడు రోజులు ఆగి పత్తిని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, మునుగోడు మండల కేంద్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు కుంభం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, మిల్లర్లతో ముఖాముఖి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా పత్తిని కొనుగోలు చేయాలని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డిసిసిబి చైర్మన్లు పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. అంతేకాక తూకం యంత్రం ద్వారా తూకాన్ని పరీక్షించారు .తేమ 8 నుండి 12 శాతం లోపు ఉండేవిధంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ రైతులకు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మునుగోడు పత్తి కొనుగోలు కేంద్రం అతి ముఖ్యమైందని,ఎల్ 1 సెంటర్ గా ఉన్న ఈ కేంద్రంలో గతంలో రైతులు ఇతర జిల్లాల నుండి పత్తిని తీసుకు వచ్చే వారని, అప్పుడు జిల్లా రైతులు పత్తిని అమ్మడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ,ఈ సంవత్సరం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా కిసాన్ కపాస్ యాప్ ను ఏర్పాటు చేసిందని, ఈ యాప్ ద్వారా ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న రైతుల పత్తి సరైన తేమ శాతంతో ,నాణ్యతా ప్రమాణాలతో ఉంటే అదేరోజు కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఒక సీజన్లో రైతు మూడు సార్లు స్లాట్ బుక్ చేసుకోవచ్చుని, ఒకవేళ ఏదైనా కారణం చేత బుక్ చేసుకున్న స్లాట్ ను క్యాన్సల్ చేసుకోవచ్చుని ,ఆ స్లాట్ అలాగే ఉంటుందని స్పష్టం చేశారు. మునుగోడు కేంద్రంలో 19000 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్నందున చుట్టుపక్కల



రైతులకు పత్తి అమ్మకంలో ఎలాంటి ఇబ్బందులేదని చెప్పారు. ఈ రెండు మూడు రోజులు రైతులెవరు స్లాట్ ను బుక్ చేసుకోవద్దని, వర్షాలు తగ్గిన తర్వాత స్లాట్ బుక్ చేసుకోవాలని,పత్తిని బాగా ఆరబెట్టి తీసుకురావాలన్నారు. ఒకవేళ వర్షంలో స్లాట్ బుక్ చేసుకుని వస్తే తేమ ఎక్కువగా ఉంటే తిప్పి పంపే అవకాశం ఉంటుందని, ఈ విషయంలో రైతులు పూర్తిగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ,కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి బాలాజీ నింజె, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపి కృష్ణ ,మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మునుగోడు మండలం, కచలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, అమ్మిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, రైతులు కొనుగోలు కేంద్రం వద్దే ఉండి ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచాలని చెప్పారు.




# పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబివిపి నూతన కమిటీ

(ఆకాంక్ష న్యూస్)

మెదక్, అక్టోబర్ 24 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబివిపి) అనేక రకాల ఉద్యమాలకు నాంది పలికిందని ఏబీవీపీ మెదక్ విభాగ్ సంఘటన మంత్రి బోడ లక్ష్మణ్ అన్నారు.శుక్రవారం రోజు పాపన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షులుగా పి.సంతోష్ కార్యదర్శిగా వినయ్, ఉపాధ్యక్షులుగా విక్రం,యాది లక్ష్మి,వంశీ సహా కార్యదర్శులుగా బాలరాజ్. శ్రీకాంత్, అశ్విని తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయవాదం దేశభక్తి వైపు లక్షలాదిమంది విద్యార్థులను జాతీయవాదులుగా తయారు చేస్తున్న సంస్థ ఏబీవీపీ అన్నారు. చదువుతోపాటు నైతిక విలువలు నేర్చుకోవాలని ఆయన సూచించారు. సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకున్న విద్యార్థుల కోసం పక్క భవనాలు మంజూరు చేయాలని స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఉద్యోగాలు, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి ఆదర్శంగా నిలవాలి

## - ప్రతి విద్యార్థిని తమ ప్రాంత పిల్లలకు స్ఫూర్తిగా ఉండాలి

## - మెనూ ప్రకారం భోజనం పెట్టాలి - ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్



(ఆకాంక్ష న్యూస్)

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24 : విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ ఉద్యోగాల్లో, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ పిలుపునిచ్చారు. నేరెళ్లలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఎవరైనా సెలవులో ఉన్నారా అని ఆరా తీశారు. సెలవుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. కిచెన్ లో మెనూ చార్ట్ ను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న కూరగాయలు, కోడిగుడ్లు పరిశీలించారు. నాణ్యత సరిగా లేకపోవడంతో వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సరకుల వివరాల రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థుల వసతి గదులు పరిశీలించి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్ మీ అధ్యాపకుల భోధన ఎలా ఉంది? పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు? ఇంటర్మీడియట్ పూర్తయ్యాక ఎవరెవరు ఏయే విభాగాల్లో విద్యను అభ్యసించడానికి ఆసక్తిగా ఉన్నారు? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అనే వివరాలను క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని నిత్యం విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబర్చి టీచర్, లాయర్, ఇంజనీర్, డాక్టర్, తదితర రంగాల్లో స్థిరపడాలని, ఆర్థికంగా స్వతంత్రత సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదిగితే తమ ప్రాంతంలోని మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారని స్పష్టం చేశారు. మెనూ లో అందించే పోషకాహారం ఖచ్చితంగా తినాలని సూచించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే మీరు నిర్దేశించుకున్న లక్ష్యం ఎంత పెద్దదైనా అది సాధించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సులభతరం అవుతుందని, ఈ విషయాన్ని గ్రహించి చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తనిఖీలో తహశీల్దార్ జయంత్, ప్రిన్సిపాల్ రాధ, తదితరులు ఉన్నారు.



# ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక కృషితో ఏళ్ల నాటికల సహకారం

## - జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం

(ఆకాంక్ష న్యూస్)

వనపర్తి, అక్టోబర్, 24 : ఎన్నో ఏళ్ల నాటి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ సొంత భవన నిర్మాణం కల నేడు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ వలన సహకారం అయింది. ఎంతో ఘనచరిత్ర గల కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు జిల్లా కార్యాల యం లేకపోవడంతో చెలించిపోయిన ఆయన తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తన అభ్యర్థనకు స్పందిస్తూ వనపర్తి పట్టణ శివారు రాజపేటలోని 73/2 సర్వే నెంబర్ లోని 1ఎకరం భూమిని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే 73/2 సర్వే నెంబర్లో గల స్థలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# హెచ్ఐవి నియంత్రణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి : జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

(ఆకాంక్ష న్యూస్)

ఆసిఫాబాద్, అక్టోబర్ 24 : హెచ్ఐవి, ఎయిడ్స్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి నియంత్రణలో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, తెలంగాణ హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం మంచిర్యాల కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నీలిమలతో కలిసి పాల్గొని కలెక్టరేట్ భవనం నుండి పట్టణంలోని బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమురంభీం ఆసిఫాబాద్ ను హెచ్ఐవి/ఎయిడ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దామని, ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవి/ ఎయిడ్స్ వంటి లక్షణాలు ఉంటే వీలైనంత త్వరగా పరీక్షించుకొని సత్వర వైద్య సేవలు పొందాలని, జీవిత భాగస్వామికి కూడా పరీక్షలు చేయించాలని తెలిపారు. వ్యాధిపై బాధ్యత గల పౌరుడిగా సమగ్ర అవగాహన కలిగి ఉండి పొరుగు వారికి అవగాహన కల్పించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల




స్నేహభావంతో మెలిగి వారిలో ఆత్మస్థైర్యం నింపా లని తెలిపారు. వ్యాధి వ్యాప్తి నివారణకు నిరంతరం సహకరించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని ఆదరించి ఆత్మవిశ్వాసం కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా అందరిచే హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ పట్ల ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం





## ఇడ్లీ, దోశ,పూరీ అక్కర్లేదు..ఉదయం గుప్పెడు శెనగలతో ఆరోగ్యానికి తిరుగులేని బలం!

ప్రస్తుతం దాదాపు అందరిలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ముఖ్యంగా కరోనా తర్వాత నుంచే ఆరోగ్యంపై అటెన్షన్ అందరిలో వచ్చిందనే చెప్పాలి. అయితే ఆరోగ్యకరమైన జీవితం కోసం ఆరోగ్యకరమైన ఫుడ్ తీసుకోవడం తప్పనిసరి. ఏది పడితే అది తిని ఇది కూడా ఆరోగ్యకరమైనదే అని చాలామంది అనుకుంటారు..అయితే అది భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య పరిణామాలకు కారణమవుతుంది. సాధారణంగా మన తెలుగు ప్రజులు పొద్దున్నే ఇడ్లీ,దోశ, పూరీ,వడ,బోండా వంటివి ఎక్కువగా తింటుంటారు. అయితే వీటిన్నింటిన్ని వదిలి పొద్దున్నే గుప్పెడు నానబెట్టిన శెనగలు తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడు మేలు జరుగుతుంది. ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్, విటమిన్లు,మనరల్స్ పుష్కలంగా ఉండే శెనగలు మీ శరీరాన్ని శక్తివంతం చేయడమే కాకుండా అనేక వ్యాధుల నుండి కూడా కాపాడుతుంది. బలమైన జీర్ణవ్యవస్థ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో జీర్ణ సంబంధిత సమస్యలు చాలా కామన్ అయిపోయింది. అయితే నానబెట్టిన శెనగలు దీనికి చక్కటి పరిష్కారం చూపుతుంది. ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. పేగు కదలికలను సులభతరం చేసి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం సక్రమంగా జీర్ణం కావడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి,ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణ మధుమేహం లేదా షుగర్ అనేది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని వేధిస్తున్న ఒక తీవ్రమైన సమస్య. నానబెట్టిన శనగపప్పు బ్లడ్ లో షుగర్ లెవల్స్ ని కంట్రోల్ చేయడంలో సహాయపడుతుంది. దీనిలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. తద్వారా చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఒక అద్భుతమైన ఆహారం. బరువు తగ్గడంలో సాయం నానబెట్టిన శనగలు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇందులో ప్రోటీన్లు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉంటుంది. దీనివల్ల మీరు తరచుగా తినాలనే కోరికను నియంత్రించవచ్చు, అదనపు కేలరీలు తీసుకోకుండా ఉండవచ్చు. రోగనిరోధక శక్తి బలమైన రోగనిరోధక శక్తి మనల్ని అనేక వ్యాధుల నుండి కాపాడుతుంది. నానబెట్టిన శనగలలో ఐరన్, భాస్వరం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన మినరల్స్, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక కణాలను బలోపేతం చేస్తాయి. తద్వారా శరీరం ఇన్ఫెక్షన్లు,వ్యాధులతో సమర్థవంతంగా పోరాడగలదు.

గుండె ఆరోగ్యం నానబెట్టిన శనగలు మీ గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్ లో ఉండటం వల్ల గుండెపోటు, ఇతర గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది. చర్మం,జుట్టుకు మెరుపు ఆరోగ్యకరమైన చర్మం, మెరిసే జుట్టు కావాలని అందరూ కోరుకుంటారు. నానబెట్టిన శనగపప్పులో ఉండే ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు మీ చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి. అంతేకాకుండా ఇది జుట్టు మూలాలను బలోపేతం చేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది, ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది. నానబెట్టిన శనగపప్పును ఎలా తీసుకోవాలి? రాత్రిపూట ఒక కప్పు శనగపప్పును శుభ్రమైన నీటిలో నానబెట్టండి. ఉదయం లేచిన తర్వాత వాటిని బాగా కడిగి ఖాళీ కడుపుతో తినండి. మీ రుచికి అనుగుణంగా కొద్దిగా ఉప్పు, అల్లం ముక్కలు లేదా కావాలనుకుంటే తేనెను కూడా కలుపుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## వేల డాలర్లు పెట్టి కోట్ల మంది కొనే దుబాయ్ ఫేమస్ 'కునాఫా చాక్లెట్'.. ఈ ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకోండి








చాక్లెట్ అంటే ఇష్టపడనివాళ్లు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ ఫారిన్ చాక్లెట్స్ అంటే ఎగబడి తింటుంటారు కొందరు. అయితే దుబాయ్ ఫేమస్ అయిన కునాఫా చాక్లెట్ ని మీరెప్పుడైనా తిన్నారా? ఓ సారి తప్పక టేస్ట్ చేయాల్సిన చాక్లెట్ ఇది. చాలా చాలా టేస్టీగా ఉంటుంది. దుబాయ్ లోనే కాకుండా చాలా మిడిల్ ఈస్ట్ దేశాల్లో కూడా ఈ చాక్లెట్ ఫేమస్. వేల డాలర్లు పెట్టి ఈ చాక్లెట్ ను కొంటారు. ఈ ఖరీదైన చాక్లెట్ ను మీ ఇంట్లోనే మీరు సులభంగా తయారుచేసుకోవచ్చు. అదెలాగో ఇక్కడ చూడండి.

కునాఫా చాక్లెట్ తయారీకి కావాల్సిన పదార్థాలు -ఆయిల్ బేస్ట్ గ్రీన్ కలర్ -ఆయిల్ బేస్ట్ ఎల్లో కలర్ -వైట్ చాక్లెట్ -చాక్లెట్ మౌల్డ్స్ -పిస్తా -నువ్వులు -ఆయిల్ -పాలు -చక్కెర -ఉప్పు -డార్క్ చాక్లెట్ కాంపౌండ్ -వైట్ చాక్లెట్ కాంపౌండ్ -వెన్నిలా ఎసెన్స్ -కునాఫా స్పెషల్ సేమియా.

కునాఫా చాక్లెట్ తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద ఓ గిన్నెలో పెట్టి అందులో కొన్ని నీళ్లు పోయాలి. ఈ గిన్నె మీదనే ఓ బౌల్ పెట్టి అందులో 2-3 టేబుల్ స్పూన్ల సన్నగా తరగుక్కున్న వైట్ చాక్లెట్ వేసి కరిగించాలి. -కరిగించిన వైట్ చాక్లెట్ మిశ్రమాన్ని రెండు గిన్నెల్లోకి సగం సగంగా తీసుకోండి. ఒక గిన్నెలోని చాక్లెట్ మిశ్రమంలో ఆయిల్ బేస్ట్ గ్రీన్ కలర్..ఇంకో గిన్నెలో ఆయిల్ బేస్డ్ పసుపు కలర్ వేసుకొని కలపాలి. -తర్వాత చాక్లెట్ మౌల్డ్స్ తీసుకొని అందులో కలిపి ఉంచిన ఈ పసుపు, గ్రీన్ కలర్ మిశ్రమాన్ని చల్లినట్లుగా వేసి 10 నిమిషాలు ఫ్రిడ్జ్ లో పెట్టయాలి.

-ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 50 గ్రాముల పిస్తా వేసి తక్కువమంట మీద లైట్ గా దోరగా వేయించి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద ఉన్న పాన్ లోనే నీళ్లు వేడి చేసి ఇందులో వేయించిన పిస్తా వేసి 2-3 నిమిషాలు ఉడికించుకోవాలి. తర్వాత ఈ పిస్తాని ఈ నీళ్లలో వేసి కొంచెం బాయిల్ అయ్యాక స్టవ్ మీదనుంచి దించేయాలి.

-ఇప్పుడు పిస్తాని చల్లటి నీళ్లలో వేసి పిస్తా పైన ఉండే తొక్కను తీసేయాలి.

-తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 1 టేబుల్ స్పూన్ నువ్వులు వేసి దోరగా చిటపటలాడేదాకా వేయించిన తర్వాత దీనిని మిక్సీ గిన్నెలో వేసి,ఇందులోనే చిటికెడు ఉప్పు, 2 టేబుల్ స్పూన్ల చక్కెర వేసి మెత్తగా ఫైన్ గా గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత ఇందులోనే తొక్క తీసేసి పక్కన ఉంచిన పిస్తా, కొద్దిగా ఆయిల్ వేసి, 2 టేబుల్ స్పూన్ల కాచి చల్లార్చిన పాలు, 1 టేబుల్ స్పూన్ వెన్నిలా ఎసెన్స్ వేసి వీలైనంత మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 1 టేబుల్ స్పూన్ నెయ్యి, 50 గ్రాముల కునాఫా స్పెషల్ సేమియాని క్రష్ చేసి వెయ్యాలి. చిన్న మంట మీద గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేదాకా వేయించి పక్కనపెట్టి చల్లారనివ్వాలి. -తర్వాత ఓ బౌల్ గ్రైండ్ చేసిన పిస్తా మిశ్రమాన్ని,వేయించిన సేమియాని వేసి బాగా కలపాలి. -తర్వాత స్టవ్ మీద ఓ గిన్నెలో వాటర్ పోసి ఈ గిన్నె మీద మరో బౌల్ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల తరగిన డార్క్ చాక్లెట్ కాంపౌండ్, 2 టేబుల్ స్పూన్ల వైట్ చాక్లెట్ కాంపౌండ్ వేసి కరిగించాలి. తర్వాత దీనిని ముందుగా ఫ్రిడ్జ్ లో ఉంచిన చాక్లెట్ మౌల్స్ లో గ్యాప్స్ లేకుండా ఓ లేయర్ గా పర్చుకోవాలి. -తర్వాత ఈ చాక్లెట్ మౌల్డ్స్ ని ఫ్రిడ్జ్ లో 10 నిమిషాలు పెట్టాలి. -తర్వాత దానిని బయటకు తీసి అందులో కలిపి ఉంచిన పిస్తా,సేమియా పేస్ట్ ని వేసి,దీని చుట్టూ.. పైన కరిగించిన చాక్లెట్ మిశ్రమాన్ని వేసుకోవాలి. చాక్లెట్ మిశ్రమంతో చాక్లెట్ మౌల్డ్ ని కవర్ చేయాలి. దీనిని అరగంట సేపు ఫ్రిడ్జ్ లో పెట్టుకోవాలి. తర్వాత బయటకు తీసి చాక్టెట్ మౌల్డ్ లో నుంచి నెమ్మదిగా చాక్లెట్ ను బయటకు తీయాలి. అంతే దుబాయ్ ఫేమస్ కునాఫా చాక్లెట్ రెడీ.

## పచ్చి కొబ్బరితో కారం పొడి..ఇలా చేశారంటే అన్నం,టిఫిన్స్ లోకి అదరహో అంతే





పచ్చి కొబ్బరి కారం దక్షిణ భారతదేశంలో చాలా పాపులర్. ఈ కారం అన్నం, ఇడ్లీ, దోశ, ఇతర టిఫిన్స్ లో సైడ్ డిష్ లేదా చట్నీగా ఉపయోగించబడుతుంది. దీని తయారీ కూడా చాలా ఈజీ ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. ఇందులో ఉపయోగించే ప్రతి పదార్థం దాని సొంత ప్రత్యేకమైన పోషక విలువలను కలిగి ఉంటుంది. దీని రుచి ప్రత్యేకంగా అద్భుతంగా ఉంటుంది. మీ ఇంట్లోనే ఈజీగా పచ్చి కొబ్బరితో కారం పొడి ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

పచ్చి కొబ్బరి కారం తయారీకి కావలసిన పదార్థాలు -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1 టేబుల్ స్పూన్ -వెల్లుల్లి రెబ్బలు - 4-5 -కరివేపాకు - 1 రెబ్బ -ఎండు మిరపకాయలు - 8-10 - పచ్చి కొబ్బరి తురుము - 1 కప్పు -శనగపప్పు - 2 టేబుల్ స్పూన్లు -ధనియాలు - 1 టీ స్పూన్ -చింతపండు - చిన్న ముక్క -ఉప్పు - రుచికి తగినంత -నూనె - 2 టేబుల్ స్పూన్లు.

కొబ్బరి కారం తయారీ విధానం - ముందుగా స్టవ్ మీద ఒక బాండీ పెట్టి అందులో ఆయిల్ పోసి వేడి చెయ్యాలి. నూనె వేడెక్కిన తర్వాత శనగపప్పు, మినపప్పు వేసి అవి గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి. తర్వాత ధనియాలు,జీలకర్ర వేసి కొద్దిగా వేయించాలి. -ఇప్పుడు అందులో ఎండు మిరపకాయలు వేసి అవి కొద్దిగా కారం వాసన వచ్చే వరకు వేయించాలి. మీరు మీ రుచికి తగినట్లుగా ఎండు మిరపకాయల సంఖ్యను పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. - తర్వాత అందులో వెల్లుల్లి రెబ్బలు,కరివేపాకు వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. వెల్లుల్లి కొద్దిగా వేగాక మంచి సువాసన వస్తుంది. - చివరగా పచ్చి కొబ్బరి తురుము వేసి అది వేడి అయ్యే వరకు వేయించాలి. ఎక్కువ వేయిస్తే కొబ్బరిలోని తేమ తగ్గి కారం పొడిలా తయారవుతుంది. కాబట్టి కొద్దిగా వేడి చేస్తే సరిపోతుంది.

-స్టవ్ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీ గిన్నెలో వేయాలి. ఇందులోనే చింతపండు, రుచికి తగినంత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీరు కూడా కలుపుకోవచ్చు కానీ సాధారణంగా పచ్చి కొబ్బరిలో ఉండే తేమ సరిపోతుంది. -గ్రైండ్ చేసిన కారాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఈ కారాన్ని నిల్వ చేసుకోవడానికి ఒక గాలి చొరబడని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో ఉంచితే కొన్ని రోజుల వరకు ఫ్రెష్ గా ఉంటుంది.

## మామిడికాయ మునక్కాడ సాంబార్..




మామిడికాయ మునక్కాడ సాంబార్ తయారీకి కావలసిన పదార్థాలు -మునక్కాయలు - 2 -ఉల్లిపాయ - 1 -మామిడికాయ - 1 -నూనె -తగినంత -ఉప్పు - తగినంత -కొత్తిమీర - కొద్దిగా -కంది పప్పు - 1 కప్పు -టమాటో - 1 -పచ్చిమిర్చి - 2-3 - కరివేపాకు - 2 రెమ్మలు -ఆవాలు - 1 టీస్పూన్ -మెంతులు - 1/4 టీస్పూన్ -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఎండు మిర్చి - 2 -ఇంగువ - చిటికెడు -పసుపు - 1/2 టీస్పూన్ -సాంబార్ పొడి - 2 టేబుల్ స్పూన్లు తయారీ విధానం -ముందుగా కంది పప్పును శుభ్రంగా కడిగి తగినంత నీరు పోసి కుక్కర్‌లో లేదా గిన్నెలో మెత్తగా ఉడికించుకోవాలి. పప్పు మెత్తగా ఉడికిన తర్వాత పప్పు గుత్తితో బాగా మెదుపుకోవాలి. -ఇప్పుడు మామిడికాయను చెక్కు తీసి మీడియం ముక్కలుగా కట్ చేసుకోండి. మునక్కాయలను కూడా శుభ్రంగా కడిగి సుమారు 2 అంగుళాల పొడవు ముక్కలుగా కట్ చేసుకోండి. ఉల్లిపాయను చిన్నగా తరుగుకోండి. టమాటోను కూడా చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీలికలుగా చేసుకోండి. -తర్వాత ఒక పెద్ద గిన్నె లేదా పాన్ లో ఆయిల్ వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత మెంతులు, జీలకర్ర వేసి కొద్దిగా వేయించండి. ఎండు మిర్చి,ఇంగువ కూడా వేసి ఒక నిమిషం వేయించండి. -ఇప్పుడు తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి లేత గోధుమ రంగు వచ్చే వరకు వేయించండి. ఉల్లిపాయలు వేగిన తర్వాత తరిగిన టమాటో ముక్కలు, చీలికలుగా చేసుకున్న పచ్చిమిర్చి వేసి టమాటోలు మెత్తగా అయ్యే వరకు ఉడికించండి. టమాటోలు త్వరగా ఉడకడానికి కొద్దిగా ఉప్పు వేసుకోవచ్చు. -టమాటోలు మెత్తగా ఉడికిన తర్వాత కట్ చేసుకున్న మునక్కాయ ముక్కలు, కరివేపాకు వేసి ఒక నిమిషం పాటు వేయించండి. తర్వాత పసుపు పొడి, సాంబార్ పొడి వేసి బాగా కలపండి. మసాలాలు కూరగాయలకు బాగా పట్టేలా కొద్దిసేపు వేయించండి. -ఇప్పుడు మెదిపి పెట్టుకున్న కంది పప్పును ఈ మిశ్రమంలో వేసి బాగా కలపండి. అవసరమైనంత నీరు పోసి సాంబార్ చిక్కదనాన్ని సర్దుబాటు చేసుకోండి. మరీ పల్చగా లేదా మరీ చిక్కగా కాకుండా చూసుకోండి. -సాంబార్ కొద్దిగా ఉడుకుతున్నప్పుడు కట్ చేసుకున్న మామిడికాయ ముక్కలు వేయండి.

# సినిమా న్యూస్



## మాజీ ప్రియురాలికి బర్త్ డే విషెస్ చెప్పిన స్టార్ హీరో




బాలీవుడ్ సెలబ్రిటీలు చాలా ప్రాక్టికల్ గా ఉంటారు. అందుకే ఏ విషయాన్నైనా ఉన్న దాని కంటే ఎక్కువగా ఆలోచించకుండా ముందుకెళ్తుంటారు. అందుకే బ్రేకప్స్ అయ్యాక కూడా వారు చాలా నార్మల్ గా ఉండగలరు. బయట ఎక్కడైనా అనుకోకుండా కలిసినా చాలా క్యాజువల్ గా మాట్లాడుకుంటూ కనిపిస్తారు. అసలు ఇదంతా ఎందుకంటే బాలీవుడ్ భామ మలైకా అరోరా పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు సోషల్ మీడియాలో బర్త్ డే విషెస్ వెల్లువెత్తుతున్నాయి. మలైకాకు అర్జున్ బర్త్ డే విషెస్ ఆమె అభిమానుల నుంచి, ఇండస్ట్రీకి చెందిన సెలబ్రిటీల నుంచి మలైకాకు బర్త్ డే విషెస్ వస్తుండగా, మలైకా మాజీ ప్రియుడు అర్జున్ కపూర్ కూడా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలను చెప్తూ ఆమె ఫోటోను షేర్ చేశారు. హ్యాపీ బర్త్ డే మలైకా, మీరెప్పుడూ ఇలానే నవ్వుతూ ఉండాలంటూ రాసుకొచ్చారు. అర్జున్ చేసిన పోస్ట్ కు మలైకా కూడా థాంక్ యూ అంటూ లవ్ సింబల్ ను జోడించి రిప్లై ఇచ్చారు. అర్జున్ బర్త్ డే విష్ చేసిన మలైకా అయితే మొన్నా మధ్య జూన్ లో అర్జున్ కపూర్ బర్త్ డే కు, మలైకా కూడా సోషల్ మీడియాలో మాజీ బాయ్‌ఫ్రెండ్ కు బర్త్ డే విషెస్ తెలిపారు. కాగా మలైకా, అర్జున్ కపూర్ ఆరేళ్ల పాటూ రిలేషన్ లో ఉన్న సంగతి తెలిసిందే. గతేడాది వీరిద్దరూ విడిపోయారన్నారు. మొన్నామధ్య ఓ ఈవెంట్ లో అర్జున్ కపూర్ తాను ప్రస్తుతం సింగిల్ గా ఉన్నానని చెప్పి తన బ్రేకప్ గురించి క్లారిటీ ఇచ్చారు. అయితే వారి బ్రేకప్ తర్వాత మలైకా తండ్రి చనిపోవడంతో అర్జున్ కపూర్, ఆమెను ఇంటికెళ్లి మరీ పరామర్శించారు. రీసెంట్ గా కూడా వీరిద్దరూ ముంబైలో జరిగిన హోమ్ బౌండ్ ప్రీమియర్ కు హాజరై ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకున్నారు. ఇప్పుడు మలైకాకు అర్జున్ బర్త్ డే విషెస్ చెప్పడంతో వీరి పాత రిలేషన్ మరోసారి వార్తల్లోకెక్కింది.

## చీరకట్టు.. పూల జడ.. ఆకట్టుకుంటున్న అమైరా దస్తూర్!



ఇండియన్ మోడల్.. సినీ హీరోయిన్ అయినటువంటి అమైరా దస్తూర్ ఎప్పటికప్పుడు తన హాట్ అందాలతో కుర్రకారుకు సెగలు పుట్టిస్తూ ఉంటుంది. హిందీ సినిమాల ద్వారా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాల్లో అవకాశాల కోసం ఎదురు చూస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎల్లో కలర్ శారీలో ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.. తాజాగా అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీ ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఇందులో అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీతో పాటు తన పూల జడతో హైలెట్ అయింది. ముఖ్యంగా మల్లెపూలతో హెయిర్ స్టైల్ చేయించుకున్న ఈ ముద్దుగుమ్మని వెనక నుండి చూస్తే అచ్చ తెలుగు ఆడపిల్లలాగే కనిపిస్తోంది. ఇక స్లీవ్ లెస్ బ్లౌజ్ తో అందాలు హైలైట్ అయ్యేలా ఈ ముద్దుగుమ్మ తన శారీ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ శారీలో అమైరా దస్తూర్ మరింత అందంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ చూసిన చాలామంది నెటిజన్స్ ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ అందమే దిగివచ్చినట్లు ఉంది అన్నట్లుగా కామెంట్లు పెడుతున్నారు. తన నడుము ఒంపు సొంపులు చూపిస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. చాలామంది ఈ ఫోటోలు చూసి పలు కామెంట్లు పెడుతున్నారు.. అమైరా దస్తూర్ పర్సనల్ సినీ కెరియర్ విషయానికి వస్తే.. మోడలింగ్ ద్వారా సినిమాల్లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ 2013లో వచ్చిన బాలీవుడ్ మూవీ ఇసాక్ తో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత హిందీ తో పాటు తెలుగు,తమిళ సినిమాల్లో కూడా నటించింది. ఇక అమైరా దస్తూర్ సందీప్ కిషన్ హీరోగా నటించిన మనసుకు నచ్చింది అనే మూవీతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. అలాగే రాజ్ తరుణ్ హీరోగా వచ్చిన రాజుగాడు మూవీ లో కూడా హీరోయిన్ గా నటించింది.

## ఫ్రాన్స్ అందాలను ఆస్వాదిస్తూ.. అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పూజిత!



తెలుగు సినిమా ఇండస్ట్రీలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి చాలా తక్కువ మంది హీరోయిన్స్ ఇండస్ట్రీకి పరిచయం అవుతుంటారు. టాలీవుడ్ లో ఎక్కువ శాతం మంది ఇతర భాష హీరోయిన్ల హవానే కొనసాగుతుంది. అలా కర్ణాటక,తమిళనాడు, ముంబై, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల భామలే ఎక్కువగా టాలీవుడ్ ఇండస్ట్రీని ఏలుతూ ఉంటారు. టాలీవుడ్ లో తెలుగు వాళు చాలా తక్కువ మంది హీరోయిన్లు ఉంటారు. అలాంటి వారిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది పూజిత పొన్నాడ..ఆంధ్రప్రదేశ్ కు చెందిన పూజిత పొన్నాడ షార్ట్ ఫిలిం ద్వారా ఎంట్రీ ఇచ్చి 'తుంటరి' అనే మూవీతో సిల్వర్ స్క్రీన్ పై మెరిసింది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ సమయం దొరికితే చాలు ఎక్కువగా వెకేషన్స్ కి వెళ్తూ ఎంజాయ్ చేస్తూ ఉంటుంది. ఎప్పుడు ఫ్రెండ్స్ తో కలిసి వెకేషన్స్ కి వెళ్లడానికే ఎక్కువగా ఇష్టపడుతుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా ఫ్రాన్స్ కి వెకేషన్ కి వెళ్ళింది. అక్కడ నుంచీ ఫ్రెండ్స్ అందాలను ఆస్వాదిస్తూనే.. మరొకవైపు క్రూయిజ్ షిప్ లో ఉన్న కొన్ని ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసుకుంది. ఈ ఫోటోలు వైరల్ గా మారడంతో మళ్ళీ పూజిత వెకేషన్ మోడ్ లోకి వెళ్ళింది అంటూ ఆమె అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. తాజాగా పూజిత పొన్నాడ క్రూయిజ్ షిప్ లో ఉన్న ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇందులో పూజిత అందాలు హైలెట్ అయ్యేలా బ్లాక్ కలర్ డ్రెస్ ధరించింది.. అలా బ్లాక్ కలర్ డ్రెస్ లో క్రూయిజ్ షిప్ లో కూర్చొని ఫోటోలకు ఫోజులు ఇవ్వడమే కాకుండా సముద్రం వ్యూ,అక్కడి చుట్టుపక్కల ఉన్న లొకేషన్ అందాలను కూడా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ "క్రూయిజ్ షిప్ తీర ప్రాంతాల్లో గ్లైడింగ్ చేస్తూ దాని చుట్టూ ఉన్న ప్రత్యేకమైన పట్టణాలను కవర్ చేస్తూ ఎన్నో అద్భుతమైన దృశ్యాలను చూపిస్తోంది" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం పూజిత పొన్నాడ పెట్టిన ఈ వెకేషన్ ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారాయి. పూజిత పొన్నాడ సినీ పర్సనల్ కెరియర్ గురించి చూసుకుంటే.. ఏపీలోని వైజాగ్ లో పుట్టి పెరిగిన పూజిత పొన్నాడ బీటెక్ పూర్తి చేసి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా కొద్ది రోజులు పని చేసింది.ఆ తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి ఉప్మా తినేసింది అనే ఫిలింతో యాక్టింగ్ మొదలుపెట్టింది. టాలీవుడ్ లో నారా రోహిత్ హీరోగా వచ్చిన తుంటరి మూవీతో ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత ఊపిరి,రంగస్థలం, హ్యాపీ వెడ్డింగ్, ఓదెల రైల్వే స్టేషన్, మిస్ ఇండియా, వేర్ ఇస్ ది వెంకటలక్ష్మి, బ్రాండ్ బాబు, రావణాసుర, హరిహర వీరమల్లు వంటి సినిమాల్లో నటించింది. ఈ హీరోయిన్ కేవలం తెలుగులోనే కాకుండా తమిళ భాషలో కూడా కొన్ని సినిమాలు చేసింది. అలా సాఫ్ట్వేర్ ఇంజనీర్ నుండి సినీరంగం వరకు పూజిత పొన్నాడ సక్సెస్ఫుల్ గా తన కెరీర్ ని ముందుకు తీసుకువెళ్తుంది..

## నా విడాకులను కొంతమంది సెలబ్రేట్ చేసుకున్నారు



సమంత. కొంత కాలం ముందు వరకు సౌత్ లో స్టార్ హీరోయిన్ గా కొనసాగిన సమంత ఇటీవల కాలంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ఫ్యాన్స్ నుంచి ఎంత ప్రేమాభిమానాలు దక్కినా, తన పర్సనల్ లైఫ్ లో జరిగిన సంఘటనలు ఆమెను ఎంతో ఇబ్బంది పెట్టాయి. నాగ చైతన్య నుంచి విడిపోవడం, ఆ తర్వాత మయోసైటిస్ వ్యాధితో బాధపడటం ఇవన్నీ సమంతను లైమ్ లైట్ లోకి రాకుండా చేశాయి. ఇప్పుడిప్పుడే వాటి నుంచి నెమ్మదిగా కోలుకుని తిరిగి కెరీర్లో పుంజుకోవడానికి సమంత రెడీ అవుతున్నారు. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత తనపై వచ్చిన ట్రోల్స్, నెగిటివిటీ గురించి మాట్లాడారు. తాను కెరీర్లో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నానని, ఆ టైమ్ లో తనను ద్వేషించే వాళ్లు తనను చూసి నవ్వారని, ఓ వైపు తాను మయోసైటిస్ తో బాధపడుతుంటే తనను చూసి ఎగతాళి చేశారని చెప్పారు. ఆఖరికి తన విడాకులను కూడా కొంతమంది సెలబ్రేట్ చేసుకున్నారని, తన లైఫ్ ఎలా ఉండాలనే విషయాన్ని కూడా వాళ్లే డిసైడ్ చేసేవారని, అవన్నీ చూసి మొదట్లో చాలా బాధపడ్డానని, కానీ తర్వాత వాటిని పట్టించుకోవడం మానేశానని గతంలో తనపై వచ్చిన విమర్శలను ఎంతో నిజాయితీగా వెల్లడించారు సమంత. అయితే లైఫ్ లో ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా సమంత వాటిని ధైర్యంతో ఎదుర్కొంటున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం సమంత, రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రక్త్ బ్రహ్మాండ్ లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com